క్లుప్తంగా

పౌష్టికాహారం వడ్డించాలి

తహసీల్దారు గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

దౌల్తాబాద్: విద్యార్థులకు మెను ప్రకారం పౌష్టికాహారం వడ్డించాలని తహసీల్దారు గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే పాఠశాలలో వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్ స్వామి, హెచ్ఎం శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

పంట వివరాల నమోదు తప్పనిసరి

ఏఈఓ మహేశ్



వివరాలు సేకరిస్తున్న మహేశ్

మర్పల్లి: ఖరీఫ్ పంట వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సిరిపూరం క్లస్టర్ ఏఈఓ మహేశ్ రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని కొత్లాపూర్‌లో సాగు చేసిన పంట వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన పంటలను మార్కెట్‌లో విక్రయించుకొనేందుకు సులభతరంగా ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో పంట వివరాలను నమోదు చేయించుకోకపోతే పంట దిగుబడులు మార్కెట్‌లో విక్రయించేందుకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇటీవల వర్షాలకు పాడైన పంటల వివరాలను కూడా నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నామన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి

ఎస్ఐ యాదగిరి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

దుద్యాల్: ప్రమాదాలు సంభవించకుండా వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ యాదగిరి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో పలు సూచనలు చేశారు. పోలేపల్లిలోని శ్రీ సాయి కంపెనీ డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమనిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగి హెల్మెట్ ధరించి నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి కంపనీ ఇన్‌చార్జి అంజిల్‌రెడ్డి, సూపర్‌వైజర్ మల్లేశ్, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

నూతన రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ పంపిణీ



ప్రొసీడింగ్‌లను అందిస్తున్న అధికారులు

కుల్కచర్ల: అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు కుస్మసముద్రం పంచాయతీ కార్యదర్శి జీవామృతం పేర్కొన్నారు. గురువారం కుస్మసముద్రంలో నూతన రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్యాగ కేశవులు, వడ్డె రాములు, డ్యాగ శ్రీను, పుల్ర బాబు, సత్యం, సాయప్ప, శాంతయ్య, పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి ఎంపిక



టీఎల్ఎం ప్రదర్శనలో ఎంఈఓ, అధికారులు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన టీఎల్ఎం ప్రదర్శనలో పలు పాఠశాలలు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. తెలుగులో ఎట్లకుంట, బొంరాస్‌పేట (బాలికలు), ఆంగ్లంలో బొంరాస్‌పేట (బాలికలు), వడిచర్ల, కొత్తూరు, గణితంలో నాందార్‌పూర్, డీప్లానాయక్‌తండా, బురాన్‌పూర్, ఈవీఎస్‌లో బొంరాస్‌పేట (బాలికలు), పీఎస్ చౌదర్‌పల్లి పాఠశాలు ఎంపికయ్యాయి. ఇందులో ఎంఈఓ హరిలాల్, ఆర్పీలు, పరిశీలకులున్నారు.

పక్కాగా సాగు వివరాల నమోదు

- క్షేత్రస్థాయిలో పరిశీలించనున్న ఏఈఓలు
- డిజిటల్ క్రాప్ సర్వేతో లబ్ధి
- రైతులకు చేకూరనున్న ప్రయోజనం

దౌల్తాబాద్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో వ్యవసాయ అధికారులు పంటల సర్వే చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అక్టోబర్ 25 వరకు సర్వే నిర్వహించనున్నారు.

34 పంచాయతీలు..తొమ్మిది క్లస్టర్లలో..

దౌల్తాబాద్ మండలంలోని 34 గ్రామ పంచాయతీలకు తొమ్మిది క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్ కింద ఐదు నుంచి ఆరు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ 9 క్లస్టర్లలో ఆరుగురు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పంటలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా..

గత ప్రభుత్వం తొలుత పంటల సాగు విస్తీర్ణ వివరాలు సేకరించి ఆ తర్వాత ట్యాబ్‌లలో నమోదు చేసేవారు. ఈ సారి అందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో ఏఈఓలు పంటల విస్తీర్ణాన్ని పరిశీలించిన తర్వాతే ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో నమోదు చేయనున్నారు.



పంట సర్వే చేస్తున్న ఏఈఓ నిఖిల్

అన్ని వివరాల సేకరణ..

క్రాప్ బుకింగ్ ప్రక్రియలో రైతు పేరు, సర్వే నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, పట్టాదారు పాసుబుక్, ఫోన్ నంబర్‌తో పాటు ఏఏ పంటలు ఎంత మేర సాగు చేశారనే వివరాలను రికార్డు చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చేపడుతున్నారు. పక్కాగా లెక్కల వివరాలు ఉండేలా పారదర్శకంగా చేపడుతున్నారు. మండలంలో సుమారు 15వేల ఎకరాల్లో వరి, పత్తి, పెసర పంటలు సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా.

> **రైతులకు మేలు**
>
> సీజన్‌లో భాగంగా సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసేందుకు డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏఈఓలు క్రాప్ బుకింగ్ సర్వే చేస్తున్నారు. దీంతో రైతులకు మేలు చేకూరనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సత్వరమే సర్వే పూర్తి చేస్తాం.
>
> – లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

గుంతలమయంగా రోడ్లు!



మర్పల్లి నుంచి మోమిన్‌పేట్ వెళ్లే రోడ్డు దుస్థితి

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

మర్పల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ, పంచాయత్ రాజ్ శాఖ రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల మయంగా మారాయి. దీంతో ఈ దారిగుండా ప్రయాణించాలంటే వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారని వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి కోట్‌పల్లి వరకు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి సంవత్సరం క్రితం నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో పనులు సకాలంలో ప్రారంభించడం లేదు. దీంతో ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. క్యాసారం నుంచి రావులపల్లి, కల్‌ఖోడ, తొర్మామిడి వరకు రోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరైనప్పటికీ సదరు కాంట్రాక్టర్ రోడ్డుపై తట్టెడు మట్టి పోయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. బుధవారం సాయంత్రం కల్‌ఖోడ మీదుగా బంట్వారం వెళ్లే ఆర్టీసీ బస్సు అతివేగంగా వస్తున్న ఆటోను తప్పించేక్రమంలో రోడ్డు పక్కన గుంతలోకి దూసుకు పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



బషీరాబాద్: లబ్ధిదారుకు ఇళ్ల ప్రొసీడింగ్ అందజేస్తున్న నారాయణరావు



దోమలో ప్రొసీడింగ్ అందజేస్తున్న శివకుమార్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే నారాయణరావు

బషీరాబాద్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తాండూరు మాజీ ఎమ్మెల్యే ఎం .నారాయణరావు పేర్కొన్నారు. గురువారం దామర్‌చెడ్ గ్రామానికి చెందిన చెరుకుల అర్చనకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి సంబంధించి ప్రొసీడింగ్‌ను భర్త రాజుగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇళ్లు మంజూరవుతాయన్నారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో తాండూరు నియోజకవర్గంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు గౌడ్, దన్‌సింగ్, పవాన్‌కుమార్ ఠాకూర్, సిదార్థ్, మునీర్, నరేశ్, ఎల్లప్ప, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

దోమ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాలి శివకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం దోమ మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మల్లేశ్ యాదవ్, రాజు, కారోబార్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి

కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి



స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఏఓ కరుణాకర్‌రెడ్డి

బంట్వారం: విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కోట్‌పల్లిలోని పలు ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణ నిర్వాహకులు వ్యవసాయ శాఖ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ధరల పట్టిక, స్టాక్ రిజిస్టర్ తప్పకుండా ఉండాలన్నారు. నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు.

ఓటర్ జాబితా సవరణ పూర్తి



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ మహేశ్ కుమార్ తదితరులు

దుద్యాల్: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. వారం రోజుల క్రితం అధికారులు ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాను ప్రదర్శించారు. అభ్యంతరాలకు రెండు రోజుల సమయం కూడా ఇచ్చారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన అభ్యంతరాలను సరిచేసి గురువారం తుది జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహేశ్ కుమార్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయతీలకు గాను 21,080 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పూర్తి జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో లబ్ధి



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

మండల స్థాయిలో మేళా

దౌల్తాబాద్: టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని ఎంఈఓ వెంకట్ స్వామి అన్నారు. పాఠశాల స్థాయిలో సులభతరంగా, ప్రయోగాత్మకంగా నేర్చుకునేందుకు ఇది దోహదపడుతుందన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనకు పంపనున్నామని ఎంఈఓ వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గాయత్రి, ఎంపీడీఓ శ్రీనివాస్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బోధన సులభతరానికి టీఎల్ఎం : ఎంఈఓ సాయిరెడ్డి

పూడూర్: బోధన సులభతరానికి టీఎల్ఎం దోహదపడుతుందని మండల విద్యాధికారి సాయిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బోధన అభ్యాసన సామగ్రి మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభతరంగా బోధించడానికి ఉపాధ్యాయుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పాండు, ఆయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌పుత్ మహిళా సంఘం నూతన కమిటీ



కమిటీ సభ్యులను సన్మానం చేస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని అప్పాయిపల్లిలో రాజ్‌పుత్ మహిళా కమిటీని ఎన్నుకున్నారు. గురువారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన సంఘం కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌పుత్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు అనితా ఠాకూర్ ఆధ్వర్యంలో ఇతర సభ్యులను నియమించారు. అప్పాయిపల్లి రాజ్‌పుత్ మహిళా అధ్యక్షురాలిగా మోతీ ఠాకూర్, ప్రధాన కార్యదర్శిగా జాను ఠాకూర్, గౌరవ అధ్యక్షురాలిగా గోరి ఠాకూర్, కోశాధికారిగా రుక్మిణీ ఠాకూర్‌లను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతానికి కృషి చేస్తూ మహిళలు ఒకరినొకరు సహాయ సహకారాలు అందిస్తూ అభివృద్ధి సాధించాలని జిల్లా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు శ్యామ గోకుల్‌సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేఖ ఠాకూర్, సుశీలమ్మ, గీత, తుల్జా పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కొడంగల్: రసీదు ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గురువారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. బాకారం చంద్రశేఖర్, కరెంటు రాములు, గంతల శేఖర్, గంట వెంకటయ్య, కానుకుర్తి రమేశ్, కానుకుర్తి రాజ్‌కుమార్ తదితరులు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్ర యాదవ్, పీ శ్రీనివాస్‌గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి, పప్పు డాగలు కలిసి తమవంతు సహకారం అందించాలని కోరారు. స్పందించిన భక్తులు సుమారు రూ. మూడు లక్షల వరకు విరాళాలు అందజేశారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు..

దౌల్తాబాద్: మండల కేంద్రంలో చాకలిఐలమ్మ విగ్రహ ఏర్పాటుకుగాను మాటూరు గ్రామానికి చెందిన టీఎంపీఎస్ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు కోట్లహన్మంతు రూ.11వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరనారి చాకలిఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

యూరియా అందక ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

కుల్కచర్ల: యూరియా కోసం రైతుల ఇబ్బందులు తప్పడం లేదు. గురువారం ఆగ్రో కేంద్రాలు, ఫర్టిలైజర్ దుకాణాల వద్ద రైతులు భారీగా క్యూకట్టారు. కుల్కచర్లలోని ఆగ్రోకేంద్రానికి 220 సంచులు రావడంతో అందరికి సరిపడకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారంరోజుల నుంచి యూరియా కోసం క్యూలైన్లో నిలబడాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులు స్పందించి సరిపడ యూరియా పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



కుల్కచర్ల: బండవెల్కిచర్లలో భగత్‌సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు



బంట్వారం: బస్వాపూర్‌లో గణనాథుడి పూజలో భక్తులు



కొడంగల్ రూరల్: నిమజ్జనోత్సవంలో సన్‌సిటీ కాలనీవాసులు



దుద్యాల్: హస్నాబాద్ స్వామి వారి పూజలో భక్తులు



అనంతగిరి: చిన్నారుల నృత్య ప్రదర్శన



పూడూరు: నృత్యం చేస్తున్న మహిళలు

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో ఏర్పాటు చేసిన ఆయా మండపాల వద్ద పూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలు, అన్నదానంలో అధికారులు, రాజకీయనాయకులు పాల్గొని గణనాథుని ఆశీస్సులు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం కొందరు డప్పులు, బ్యాండ్ మేళాలతో, ఆట పాటలతో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.



మోమిన్‌పేటలో వినాయక శోభా యాత్ర



అనంతగిరి: ఇంద్రానగర్‌లో గణనాథున్ని దర్శించుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



కొడంగల్: అన్నదానంలో భక్తులు



తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో పూజలు చేస్తున్న భక్తులు